క్లుప్తంగా

నేడు ఒలింపిక్ డే రన్

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా మంగళవారం ఒలింపిక్ రన్ నిర్వహించనున్నట్లు ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బి.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒలింపిక్ రన్ ఉదయం ఏడు గంటలకు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమై రాజ్‌విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల సర్కిల్ మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగుతుందన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలన్నారు.

కబడ్డీలో రాణించాలి

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రీడలకు విశేష స్పందన లభిస్తోంది. నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో సోమవారం జరిగిన కబడ్డీ పోటీల్లో వివిధ పాఠశాలలకు చేందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షకులు భూపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: దిన్నెదేవరపాడు గ్రామం వేముల వెంగన్న గారి ఈశ్వర స్వామి ఆలయం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీలోగా మద్దూరు నగర్‌లోని దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

ఢిల్లీలో 'వాల్మీకుల పాలికేక'



కరపత్రాలు విడుదల చేస్తున్న నేతల

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్టీ సాధన కోసం ఢిల్లీలో వాల్మీకుల పాలికేక పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం సుభాష్ చంద్ర బోస్ తెలిపారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పాలికేక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ రాష్ట్రప్రభుత్వం గత మార్చి 24న అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిందన్నారు. ఆ తీర్మానాన్ని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలనే డిమాండ్‌పై ఆగస్టు 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి రాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాంభీంనాయుడు, ఉపాధ్యక్షుడు పరమటూరు శేఖర్, కార్యదర్శి ఉమామహేష్, అధికార ప్రతినిధి గంగాధర్, జిల్లా అధ్యక్షులు మునగాల శ్రీను, ఉపాధ్యక్షులు బాలు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుదర్శన్ పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు కల్చరల్: ఇంటి స్థలం విషయంలో తల్లితో గొడవ పడి ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకున్న పోతురాజు విజయ్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గణేష్ నగర్‌కు చెందిన విజయ్.. అంబేడ్కర్ భవన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇంటి స్థలం మూడు సెంట్లలో ఒకటిన్నర సెంట్ తన పేరుమీద ఇవ్వాలని తల్లి లక్ష్మీదేవిని కోరగా ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఈనెల 18న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్తీలోని 6వ వార్డులో రూ.7 లక్షలతో చేపట్టనున్న రోడ్లు, మురుగు కాల్వలు, నీటి ట్యాంకుల పనులను సోమవారం కార్పొరేటర్ షేక్ నీలోఫర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ హకీం, షేక్ సలామ్ మియ్యా, షాకీర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒలింపిక్ క్రీడలు

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఫుట్‌బాల్ పోటీలను బీ క్యాంప్ ఫుట్ బాల్ క్లబ్ మెంబర్ పాల్ విజయ్ కుమార్, సాఫ్ట్‌బాల్ పోటీలను ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్, జిమ్నాస్టిక్స్‌ను ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ ప్రారంభించారు.

ఉల్లంఘనులకు జరిమానా

కర్నూలు కల్చరల్: ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్‌లు మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలపై డ్రైవ్ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న 31 మంది మైనర్లకు రూ.63,085 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్ చేసిన వాహన చోదకుల తల్లి దండ్రులను పిలిపించి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు.

నాడు రైతు.. నేడు వ్యాపారి

- ప్రభుత్వ ప్రోత్సాహంతో పసుపు, కారం తయారీ యూనిట్ ఏర్పాటు
- ప్రతి నెలా 5 టన్నుల పసుపు విక్రయం
- నాణ్యతను ధ్రువీకరిస్తూ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్
- వ్యాపారంలో రాణిస్తున్న సుజాత



పొదుపు మహిళ ఏర్పాటు చేసుకున్న పసుపు, కారం పొడి మిషన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఒకప్పుడు సాధారణ మహిళా రైతు.. పసుపు, కారం తయారీ, ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకొని అద్భుతంగా రాణిస్తూ వేలాది పొదుపు మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు కర్నూలు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన కె.సుజాత. శివపార్వతి పొదుపు లక్ష్మి గ్రూపులో సభ్యురాలుగా ఉన్న ఈమె మొదట్లో వ్యవసాయంతో చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని భారంగా నెట్టుకొచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారంలోకి రావడతో ఆమె జీవితమే మారిపోయింది. వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, బ్యాంకు లింకేజీ తదితర వాటి ద్వారా మొత్తం రూ.4.78 లక్షలు, పీఎంఎఫ్ఎంఈ కింద చేయూత లభించింది. దీంతో రూ.20 లక్షలతో సుంకేసుల గ్రామంలోనే కారం, పసుపు తయారీతో పాటు ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేసుకుంది. పీఎంఎఫ్ఎంఈ కింద ఎస్‌బీఐ రుణ సదుపాయం కల్పించగా 35 శాతం సబ్సిడీ లభించింది. పసుపు, కారంలో నాణ్యత ఉండటంతో మార్కెటింగ్ చేసుకోవడంలో ఇబ్బంది లేకుండా పోయింది.

టన్నుల్లో విక్రయాలు..

ప్రభుత్వ ప్రోత్సాహంతో 2020లో సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో పసుపు, కారం తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్న సుజాత.. గాయత్రీ బ్రాండ్ పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు. నాణ్యతగా ఉండటంతో కిరాణం దుకాణాల వాళ్లు కూడా తీసుకెళ్తున్నారు ప్రతి నెలా 5 టన్నులకుపైగా పసుపు, టన్నుకుపైగా కారం విక్రయాలు సాగిస్తుండటంతో సెర్ప్ సీఈఓ, జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు యూనిట్‌ను సందర్శించి అభినందించారు. 'నెలకు సగటున అన్ని ఖర్చులు పోనూ రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఆదాయం వస్తుంది. 2020కి ముందు మా కుటుంబం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. పసుపు కారం తయారీ యూనిట్ ఏర్పాటు చేసుకున్న తర్వాత జీవనోపాధి మెరుగుపడింది' అంటూ సుజాత తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)లైసెన్స్ అండర్ ఎఫ్ఎస్ఎస్ యాక్ట్ 2006 కింద పసుపు, కారం నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్(నంబరు 10121012000215.) జారీ చేసింది. గాయత్రీ బ్రాండ్ పసుపు, కారం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉపయోగిస్తున్నారు. రానున్న రోజుల్లో పసుపు 10 టన్నులు, కారం 4 టన్నుల వరకు విక్రయాలు జరిపేందుకు కృషి చేస్తామని సుజాత దీమాగా చెబుతోంది. కాగా యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా తనతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తోంది.



సుజాత, సుంకేసుల, కర్నూలు మండలం

మార్కెట్‌కు తగ్గిన వ్యవసాయ ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): అన్‌సీజన్ కావడంతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తుల తాకిడి తగ్గింది. ఉల్లి, మినుములు, కొర్రలు, సోయాబీన్స్, వాము తదితర పంట ఉత్పత్తులు రావడమే లేదు. శనగలు, మొక్కజొన్నలు, కందులు, ప్రొద్దుతిరుగుడు, విత్తనాలు ఒకటి, రెండు లాట్లు మాత్రమే వస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల సీజన్‌లో ఉల్లి 6 వేల క్వింటాళ్లు, వేరుశనగ 5 వేల క్వింటాళ్ల వరకు వచ్చేవి. దాదాపు నెల రోజులుగా ఉత్పత్తులు రావడం బాగా తగ్గింది. సోమవారం అన్ని పంటల ఉత్పత్తులు కలిపి 169 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ఆగస్టు నుంచి మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తుల తాకిడి పెరిగే అవకాశం ఉంది.

లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి

కర్నూలు (రూరల్): నగరంలోని జగన్నాథ గట్టుపై అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులుకు కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని గీతాముఖర్జీ నగర్‌లో సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ, టిడ్కో గృహాల లబ్ధిదారులతో సోమవారం నగర కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లడారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి మహేష్, భీసన్న, బాలస్వామి, నగేష్, ఆశా బేగం , సోఫియా, శేఖర్, రామచంద్ర, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహీ నవరాత్రులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో వారాహీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. సోమవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి వారాహీ నవరాత్రి పూజలు నిర్వహించారు. వారాహీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి షోడశోపచార పూజ, ఊంజల్ సేవ, దర్బార్ సేవ, మణి ద్వీప వర్ణన పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. ఈనెల 28వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు నవరాత్రి పూజలు జరుగుతాయన్నారు.

- నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలోని మహా గౌరి అమ్మవారి ఆలయంలో అమ్మ వారి వారాహీ నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి లలితా సహస్ర నామార్చన, వారాహీ సహస్ర నామార్చన పూజలు జరిగాయి. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కర్నూలు: నగరంలోని బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌నగర్‌కు చెందిన దస్తగిరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈయన వంట మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. సోమవారం సూరజ్ గ్రాండ్ హోటల్ వద్ద టీ తాగి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వైపు రోడ్డు దాటుతుండగా కోడుమూరు వైపు నుంచి కర్నూలులోకి వచ్చిన లారీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద యూటర్న్ తీసుకుంటూ దస్తగిరిని ఢీకొట్టి కాళ్లపై ఎక్కడంతో రెండు కాళ్లు నుజ్జు అయ్యాయి. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దోపిడీ'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్ పాస్‌ల కౌంటర్‌లో గుర్తింపు కార్డుల జారీలో జరుగుతున్న దోపిడీపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పాసుల జారీలో జరుగుతున్న దోపిడీపై సోమవారం 'సాక్షి'లో 'ఇదో రకం దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి.వెంకటరామం స్పందించి విచారణకు ఆదేశించారు. ఎప్పటి నుంచి ల్యామినేషన్ చేయడం లేదు. ఎన్ని రోజుల నుంచి కలర్ ప్రింటర్ వాడడం లేదు. రిపేరుకు వచ్చిన వెంటనే ఎందుకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు, విభిన్నప్రతిభావంతులు, జర్నలిస్టులకు సేవల్లో లోపం ఉన్నా ఎందుకు స్పందించలేదనే అంశాపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కర్నూలు-1డిపో మనేజరు సుధారాణిని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎం, పర్సనల్ ఆఫీసర్, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారులు కూడా సేవా లోపంపై విచారించినట్లు సమాచారం.

మృతదేహం లభ్యం



యశ్వంత్ మృతదేహం

కర్నూలు:నగర శివారులోని హైదరాబాదు జాతీయ రహదారిలో ఉన్న తుంగభద్ర బ్రిడ్జి వద్ద నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన ఎస్‌టీఆర్ బిల్డింగ్స్ నివాసి యశ్వంత్ (20) మృతదేహం సోమవారం లభ్యమైంది. ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి వై.చిన్నబజారి, లీడింగ్ ఫైర్‌మెన్ సత్యరాజు, ఫైర్‌మెన్లు సి.రామాంజనేయులు, యు.రామాంజనేయులు, టి.రాంబాబు, కె.హనుమంతు తదితరులు నదిలో గాలింపు చర్యలు చేపట్టి యశ్వంత్ మృతదేహాన్ని వెలికితీశారు. వెంకటరమణ కాలనీకి చెందిన రహిమాన్ మృతదేహం ఆదివారం రాత్రి బయట పడిన సంగతి తెలిసిందే. రెండు మృతదేహాలకు సోమవారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అర్బన్ తాలూకా పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గెస్టు ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గెస్టు ఫ్యాకల్టీ

కర్నూలు(సెంట్రల్): కేజీబీవీల్లో పనిచేస్తున్న గెస్టు ఫ్యాకల్టీలను రెన్యువల్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. కొత్త వారిని తీసుకోవడానికి విడుదల చేసిన మెరిట్ జాబితాను రద్దు చేసి పాతవారినే కొనసాగించాలని కోరారు. సోమవారం కలెక్టరేట ఎదుట కేజీబీవీల గెస్టు ఫ్యాకల్టీ ధర్నా నిర్వహించారు. వారి కి మద్దతుగా అంజిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న గెస్టు ఫ్యాకల్టీకి రెండేళ్ల బోధన అనుభవం ఉన్నా కొత్త వారిని తీసుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో గెస్టు ఫ్యాకల్టీ కరుణ శాంతి, శివలక్ష్మి, వేదవతి, కృష్ణవేణి, చాంద్‌బీబీ పాల్గొన్నారు.

తారు రోడ్డు వేయాలని ధర్నా

కర్నూలు(సెంట్రల్): మండల పరిధిలోని ఉల్చాల నుంచి రేమట వరకు తారు రోడ్డు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం రేమట గ్రామస్తులు సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేమటకు రోడ్డు వసతి లేకపోవడం అన్యాయమన్నారు. రోడ్డులో ఎక్కడచూసినా మోకాలి లోతులో గుంతలు ఉండడంతో గర్భిణులు కాన్పుల సమయంలో నగరానికి తీసుకురావడానికి ఇబ్బందిగా ఉందన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందు గాంధీ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించడంతో కాసేపు ట్రాఫిక్ స్తంభించి పోయింది. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ధర్నాలో నాయకులు రాఘవేంద్ర, వెంకట్రాముడు, అబ్దుల్లా, గ్రామస్తులుల రవి, రాఘవరెడ్డి, సర్పంచ్ పెద్ద వెంకటన్న, ఉసేనయ్య పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

కర్నూలు(సెంట్రల్): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కనికే లక్ష్మన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 30 వేల మంది చేనేత కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరికి ఒక్కో కుటుంబానికి మూడు సెంట్ల స్థలం, షరతులు లేకుండా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. సిల్క్ వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని, ప్రతి చేనేత కార్మికుడికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కామర్తి రాజు, మాధవస్వామి, గణేష్, సి.గురుశేఖర్, గోవిందు, శేషఫణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి మండల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పత్తికొండ మండలంలోని 5వ సచివాలయం, కౌతాళం మండలంలోని బాపురం, ఆస్పరి, ఎమ్మిగనూరులోని దేవిబట్ట ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో అంతకంటే పైస్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలన ఆన్‌లైన్‌లో రేపు సాయంత్రంలోపు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంపీడీఓలను ఆదేశించారు. గతంలో ఇళ్ల నిర్మాణంలో స్టేజ్ కన్వర్షన్‌లో పురోగతిని చూపని ఎమ్మిగనూరు, కౌతాళం(వగరూరు, బాపురం), మంత్రాలయం-2, ఓర్వకల్లు, వెల్దుర్తి(రామళ్లకోట) ఇంజినీర్లకు షోకజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జనవరి నుంచి జూన్ లోని ఇప్పటి వరకు 216 మలేరియా కేసులు నమోదయ్యాయని, మలేరియా నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. స్పందనలో ఎక్కువగా రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు వస్తున్నాయని, తహసీల్దార్లు డిజిటల్ కీ ఉపయోగించి ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు జరిగిన భూలావాదేవీలపై ఆడిట్ చేయాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్‌కు సంబంధించి సర్వీసులను నిర్దేశించిన సమయంలోపు అందించాలన్నారు. కోసిగి, చిప్పగిరిలలోని ఏపీ సేవా కేంద్రాలు తమ పనితీరును పూర్తిగా మెరుగు పరచుకోవాలన్నారు. కృష్ణగిరిలో నిర్వహించే స్పందనకు తక్కువ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని, ఆ సంఖ్యను పెంచేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి డిజిటల్ లైబ్రేరీల నిర్మాణాల కోసం 115 ప్రదేశాల్లో రెండు నుంచి నాలుగు సెంట్ల స్థలాలను సేకరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌నారపు రెడ్డి మౌర్య మాట్లాడుతూ..కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను జూన్ 30వ తేదీలోపు అందజేసి ఆ వివరాలను సేకరించాలన్నారు. తద్వారా వారికి రైతు భరోసాను అందజేందుకు వీలవుతుందన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన అవసరం

- రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ ఎ.ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ): నూతన విద్యావిధానంపై విద్యార్థులతోపాటు అధ్యాకులు అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సూచించారు. సోమవారం వర్సిటీలో నూతన విద్యావిధానంపై అధ్యాపకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనదేశ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో నూతన విద్యా విధానం ఎంతగానో సహకరిస్తుందన్నారు. విద్యావ్యవస్థలో ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అన్ని దశల్లో కీలక పరిమాణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి సింగిల్ మేజర్, నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సులకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన జరగాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీఎఫ్.రహమాన్, హైదరాబాద డాక్టర్ మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య వనజ మహదాసు, జాతీయ ఉర్దూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఫీ మహమ్మద్, ఆర్‌యూ రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్ఛ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

కర్నూలు (న్యూసిటీ): ఇండియన్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మహిళా జట్టుకు ఎంపికైన ఆకాంక్ష మట్టేను ఆర్‌యూ వీసీ ఏ.ఆనందరావు సోమవారం సన్మానించారు. ఈనెల 14, 15 తేదీలలో భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిభ కనబరిచి జూలై 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు చైనాలోని చెంగ్డూలో జరిగే వరల్డ్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని ఆర్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కేవీ శివకిశోర్ తెలిపారు.

వినతుల వెల్లువ

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ప్రజల నుంచి నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఎన్వీ రమాదేవి, మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఏపీబీఎస్ఎస్ఎస్ జిల్లా నూతన కమిటీ

కర్నూలు కల్చరల్: ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) జిల్లా నూతన కమిటీని కొత్త పేటలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు వెల్లాల మధుసూదన శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉప కార్యదర్శి కంచుగంటల శ్యామసుందర్ రావు సమక్షంలో సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా నాగులవరం రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దావనగేరి ఆనందరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షులుగా ప్రసాదరావు, రామచంద్రాచార్, ఉప కార్యదర్శులుగా పలకూరి రాఘవయ్య, సుధాకర శర్మ, అర్చక విభాగం ప్రధాన కార్యదర్శిగా గురురాజ శాస్త్రి, కార్యదర్శిగా హరీ ఆచార్, కార్యవర్గ సభ్యులుగా ప్రదీప్‌కుమార్ శర్మ, గిరీశ్వర శర్మ, గోపాలకృష్ణ, దేవీ ప్రసాద్, విజయకుమార్, సాయికృష్ణ, గోవర్ధన్, మురళీ కృష్ణ, సురేష్, కృష్ణ ప్రసాద్, శివన్న, హిమవర్ధన్, రాధాకృష్ణలను ఎన్నుకున్నారు.

పాఠ్యపుస్తకాలు అందించాలి

కర్నూలు సిటీ: ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని ఏఐడీఎస్ఓ నగర కార్యదర్శి హెచ్.మల్లేష్ తదితరులు సోమవారం ఇంటర్మీడియెట్ బోర్డు వృత్తి విద్యాధికారి జమీర్ పాషాకు వినతి పత్రం అందజేశారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కర్నూలు (రూరల్): నగరంలోని కళా వెంకట్రావ్ భవనంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం యునాని వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్చకులకు సర్టిఫికెట్ల ప్రదానం

కర్నూలు కల్చరల్: రాష్ట్ర అర్చక ట్రెనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మహానంది క్షేత్రంలో మూడు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వీరశైవ ఆగమ అర్చకులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక ఎమ్మార్‌టీ ట్రేడ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీరై శైవ ఆగమ సలహాదారు శశిభూషణ్ సిద్ధాంతి, రాష్ట్ర జంగమ కార్పొషన్ డైరెక్టర్ జంగం రేవతి, జిల్లా జంగమ మహేశ్వర అర్చక సంఘం అధ్యక్షులు జేఎల్‌బి శాస్త్రి, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర స్వామి, కార్యదర్శి చిట్యాల బసవరాజు, కోశాధికారి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఉన్నత స్థాయి సమీక్ష

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం జరగనుంది. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారితో పాటు ఇతర ఉన్నతాధికారులతో సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సమావేశం కానున్నారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఇక్కడి అధికారులు బయలుదేరి వెళ్లారు.